# జీవితములో ఋతుక్రమము!



ప్రకృతిలో ఋతుక్రమము

ప్రకృతి ఋతుక్రమమేమిటి? జీవిత ఋతుక్రమముతో దానికి సంబంధమేమిటి? జీవితములో ఋతుక్రమమేమిటి? ఇవే ప్రశ్నలు మీలో ఉదయిస్తున్నవి కదా! నిశితముగా పరిశీలిస్తే, మనము నెమ్మదిగా ప్రకృతిని మరచిపోతున్నాము మరియు ప్రకృతికి దూరముగా సాగిపోతున్నాము. పూర్వపు రోజులలో జనులు ప్రకృతి ఒడిలో సేదతీరుతూ విశ్రాంతిని పొందేవారు. చాలామంది కళాకారులు ప్రకృతి అందాలలో మునిగిపోయి, చక్కని కళాఖండాలను, ఛాయాచిత్రములను, కవితలను, కావ్యములను లేదా మరొక విధమైన కళారూపములను ప్రపంచానికి అందించేవారు. నేడు మనము నిత్యకృత్యములనే చట్రములో బిగుసుకుపోయి, సృజనాత్మకమైన ఆలోచనలు లేక మనుగడ సాగిస్తున్నాము. దురదృష్టకరమైన విషయమేమిటంటే, జంతువులు కూడా వాటి స్వభావసిద్ధమైన ప్రవర్తనను సాగించకుండా మనము వాటికి తర్ఫీదునిస్తున్నాము కూడా! అదృష్టవశాత్తూ ప్రకృతి మాత్రము తనదైన బాణిని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నది. వాతావరణ కాలుష్యము, పెట్రోలియము కొఱకు జరిగే త్రవ్వకాలు మొదలైన విషయములు ప్రకృతిమీద ప్రభావము చూపుతున్నాయి. వాతావరణ పరిరక్షణకోసం ఎందరో శాస్త్రజ్ఞులు చేస్తున్న హెచ్చరికలను మనము పెడచెవిని పెడుతున్నాము.

వసంత, గ్రీష్మ, వర్ష, శరద్, హేమంత, శిశిర ఋతువులు సంవత్సరములో మనము గమనించే ఆరు ఋతువులు. ఇందులో ప్రతి ఋతువు జీవితములోని ఒక స్థితిని తెలియజేస్తుంది. వసంతమనే బాల్యము ఎంతో ఉత్సాహమును, ఉత్తేజమును కలుగజేసే స్థితి. అలాగే గ్రీష్మ, వర్ష, శరద్, హేమంత ఋతువులు విద్యార్థి దశ, యవ్వనము, గృహస్త మరియు బరువు బాధ్యతలతో సతమతమయ్యే మధ్యవయస్కుల దశలను తెలియజేస్తాయి. ఇక శిశిరమనేది వృద్ధాప్యము. శిశిరము తరువాత ఎలాగైతే వసంతము వస్తుందో, అలాగే మరణానంతరము మన ఆత్మకూడా వేరొక శరీరములో ప్రవేశిస్తుంది. ఇది అందరికీ తెలిసిన జీవితమునకు సంబంధించిన అతి రహస్యం.

*దేహినోస్మిన్ యథా దేహే కౌమారం యౌవ్వనం జరా*
*తథా దేహాంతరప్రాప్తి: ధీరస్తత్ర న ముహ్యతి* *< భగవద్గీత 2.13 >*

ఈ వాస్తవాన్ని అర్థము చేసుకుంటే, మనము మన జీవితములోని ప్రతి నిముషమును, ప్రతి దశను, ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఈ వ్యాసము మీలో క్రొత్త జీవితార్థాన్ని ఆవిష్కరిస్తుందని ఆశిస్తాము. ఈ విషయములు మన పెద్దలు మనకెప్పుడో చెప్పియున్నారు. ఈ విలువైన సమాచారమును మనకి అందించిన మన పూర్వికులకు హృదయపూర్వకముగా నమస్కరించాలి.

మళ్ళీ సంక్రాంతి సంచికలో కలుద్దాం! - **సుశ్రీ.**